క్లుప్తంగా

ఆధార్ కేంద్రం ప్రారంభం

వెలుగోడు: మోతుకూరు గ్రామ సచివాలయంలో సోమవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ షేక్ అమానుల్లా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆధార్ కేంద్రాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.ఈశ్వరమ్మ, సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.సుధాకర్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పి.లింగాపురం గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తగాదాలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నారు. ఇళ్ల వద్ద, పొలం వద్ద, కళ్లాల వద్ద ఏదేని సమస్య నెలకొంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆవేశాలకులోనై ఘర్షణలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం వైద్యశాలలోని మందుల స్టాక్ గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు సుబ్రమణ్యం, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

దేశెట్టికి అక్కినేని అవార్డు



దేశెట్టిని అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పట్టణానికి చెందిన ఆర్టిస్ట్ దేశెట్టి శ్రీనివాసులు రాగి ఆకుపై అక్కినేని నాగేశ్వరరావు చిత్రం వేసి అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వాహకులు అవార్డును అందజేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ రామచంద్రరావు, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు, జీసీహెచ్ వల్లూరి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసరాజు అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు.

కరివేన సత్రం స్టోర్‌రూములో పాము



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ మోహన్

మహానంది: మహానందిలోని అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన సత్రంలోని స్టోర్‌రూములో సోమవారం రాత్రి పాము కలకలం రేపింది. పామును గుర్తించిన సిబ్బంది అయ్యన్న నగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. మోహన్ మహానంది చేరుకుని స్టోర్ రూములో ఉన్న జెర్రిపోతును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు.

శ్రీగంధం చెట్ల నరికివేత

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని వెస్టన్‌కాలనీలోని ఈకేసీవీవీ హోమియో కేంద్రంలో పెంచుతున్న శ్రీగంధం చెట్లను గత నెల 13న, ఆదివారం రాత్రి దొంగతనంగా నరికితీసుకువెళ్లినట్లు హోమియో కేంద్రం నిర్వాహకులు మురళీధర్‌రావు అటవీశాఖ అధికారులకు, టూ టౌన్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి డాగ్‌స్క్వాడ్ తో అటవీశాఖ అధికారులు చెట్లను నరికిన ప్రదేశాన్ని పరిశీలించారు. కృష్ణవేణి కల్యాణ మండపం సమీపంలో ఓ వ్యక్తి ఇంటి వద్దకు డాగ్ పసిగడుతూ వెళ్లినట్లు అటవీశాఖ అధికారి సయ్యద్‌సాహెబ్ పీరా తెలిపారు. టూ టౌన్ ఏఎస్‌ఐ వీవీ రామ్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతులు చేపట్టారు. నందీశ్వరుడికి విశేష పూజలు చేపట్టిన అనంతరం బలిహరణ పూజలు నిర్వహించి ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవాన్ని చేపట్టారు.

ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తి
- ఊరూరా వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు

నందికొట్కూరు: జనం కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర మొదలు పెట్టి ఆరేళ్లు పూర్తయిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం పట్టణంలో మహా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కర్నూలు రోడ్డులో ప్రధాన రహదారిపై ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్.. జై జగన్ అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలు, బాధలను తెలుసుకొని, అధికారంలోకి వచ్చాక ప్రతి హామీని అమలు చేసిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అర్హులైన వారందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు.

ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి

నందికొట్కూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు, కృష్ణా జలాలను చెరువులకు అందించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ, కోల్స్ ఆనందాపురం వద్ద కేసీ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. ఐటీఐ కళాశాల మంజూరు చేయాలని ప్రభుత్వం తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, కౌన్సిలర్లు జాకీర్‌హుసేన్, ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అయ్యన్న, వెంకటస్వామి, భూషిగౌడ్, వనజ, వెంకటేశ్వర్లు, బాలస్వామి, పీరయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పాతబస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు

పాములపాడు: ప్రజా సంకల్పయాత్ర సోమవారం నాటికి ఆరేళ్లు పూర్తైన సందర్భంగా మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. రుద్రవరం సర్పంచు రామస్వామి, కో ఆప్షన్ సభ్యుడు ముర్తుజావలి, పీఎంసీ చైర్మన్ షేక్షావలి, అంకన్న, శివలింగం, రామ్మోహన్, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన యాత్ర

వెలుగోడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంకల్ప యాత్ర చరిత్ర సృష్టించిందని ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్ అన్నారు. 'ప్రజాసంకల్ప యాత్ర' ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పొట్టి శ్రీరాములు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శంకర్ నాయక్, చికెన్ బాబు, ఎంపీటీసీ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కే.రామ్మోహన్ రెడ్డి, ముంతల విజయభాస్కర్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరెడ్డి, షంషీర్ అలీ, గోవిందు, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహానేతకు నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజా సంకల్పానికి ఆరేళ్లు పూర్తియిన సందర్భంగా మండల కేంద్రం సున్నిపెంటలోని బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి ఎంఏ రజాక్, నాయకులు ఆసాది ప్రదీన్ దివ్యతేజ, టీఎమ్‌డీ రఫి, విష్ణు, అనీల్‌కుమార్‌రెడ్డి, బీవీఎస్ కుమార్, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరులో..

బండిఆత్మకూరు మండల కేంద్రంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి సంబరాలు చేసుకున్నారు. జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, సింగిల్ విండో చైర్మన్ శివలింగం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమసింహానాయక్, పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్, వ్యవసాయ సలహామండలి చైర్మన్ కృష్ణమల్లారెడ్డి, సర్పంచ్ సంధ్య, ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి నాయకులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



పాతబస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి



పాములపాడులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వెలుగోడులో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న నాయకులు



సున్నిపెంటలో నాయకుల నివాళి

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

మహానంది: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చి ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ మహానంది మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం బుక్కాపురంలోని రైతుభరోసా కేంద్రం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సలహా మండలి చైర్మన్ శవ్వా శరభారెడ్డి, నాయకులు కందుల వెంకటసుబ్బారెడ్డి, కుంచపు శ్రీనివాసులు, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, ఉపసర్పంచ్ కొమ్మా ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహానంది మండలం బుక్కాపురంలో నాయకుల సంబరాలు



బండిఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

- ఊరూరా ప్రజా సంకల్పం



పగిడ్యాలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పగిడ్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తి చేసుకోవడంతో మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, పడమర ప్రాతకోట, లక్ష్మాపురం తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పాలభిషేకం చేసి పూలమాలలతో జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు పల్లె అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, పెద్ద ఆంజనేయులు, సుజాత, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

- ప్రజా సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజా సంక్షేమ పథకాల ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి అన్నారు. ప్రజాసంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కొత్తబస్టాండ్, గౌడ్‌సెంటర్, రఘునాథ్‌సెంటర్ మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పువ్వాడ భాస్కర్, తిమోతి, నాగేశ్వరరెడ్డి, మోతుల్లా, పాన్ బాషా, వెంకటస్వామిగౌడ్, విజయచౌదరి, విజయ్, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ నాయకుల ర్యాలీ

జగనన్నకు సంపూర్ణ మద్దతు తెలపాలి



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పగిడ్యాల: రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు సంపూర్ణ మద్దతును తెలపాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కోరారు. సోమవారం మండలంలోని పడమర వనుములపాడులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న సంక్షేమ బావుటా పుస్తకాలను ఇంటింటికి పంపిణీ చేశారు. నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన ఆర్థిక లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసిఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు,అధికారులు

జీవనోపాధి మెరుగుపర్చుకోండి

జూపాడుబంగ్లా: రైతులు, వ్యవసాయ కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని ఉపాధి హామీ పథకం అంబుడ్స్‌పర్సన్ డాక్టర్ సురేంద్రకుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని మండ్లెం గ్రామ పరిధిలో రాజేష్ అనే రైతు సాగుచేసిన డ్రాగన్‌ఫ్రూట్స్ పంటను ఆయన పరిశీలించారు. రైతుతో మాట్లాడి పంట సాగుకు అయిన ఖర్చు, దిగుబడి వివరాలను తెలుసుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకం చేపట్టిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చేయాలని ఏపీఓ గౌరీబాయి, టీఏ సబితారాణిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



డ్రాగన్ ఫ్రూట్స్ తోటను పరిశీలిస్తున్న అంబుడ్స్‌పర్సన్ డాక్టర్.సురేంద్రకుమార్

అఖండ శివనామసంకీర్తన


మహానంది: మహానందిలో సోమవారం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి, జానపద, చెక్కభజన, భజన కళాకారుల చేత వేలాది మందితో అఖండ శివనామసంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ కల్యాణమండపం, ఆలయం ముందున్న మండపం, గరుడనంది ప్రాంగణాల్లో బృందాల వారిగా సంకీర్తన చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జానపద కళాకారుల సమన్వయ కమిటీ కన్వీనర్లు టి.రామచంద్రుడు, నల్లగట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

మహానంది: మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో ఆర్డినేటర్ సి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం శింగవరం ఉన్నత పాఠశాలలో వంద మొక్కలు నాటించారు. హెచ్‌ఎం దస్తగిరి, ఉపాధ్యాయులు సుధాకర్, శేఖర్‌రెడ్డి, ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ఆరోగ్యానికి రక్ష

ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు శ్రీరామరక్ష అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కోఆప్షన్ సభ్యులు రషీద్, పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌస్‌లాజం, షంషూర్, షాలుపైల్మాన్, పువ్వాడ భాస్కర్, విజయచౌదరి, తిమోతి, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్ పరిశీలిస్తున్న చెర్‌పర్సన్ ఆసియామారూఫ్

రైతులపై కేసులు ఎత్తివేయాలి

పాములపాడు: కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో చేపట్టిన ఉద్యమంలో రైతులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎఫ్‌ఐఆర్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు స్వామన్న, నాయకులు కోట్ల నాగేశ్వరరెడ్డి, బీఎస్పీ స్వాములు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నందికొట్కూరు: మహిళా హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రఘురామమూర్తి, రమేష్, దానమ్మ, ఈశ్వరమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి గ్రామం నుంచి ఇళ్లస్థలాలు కావాలని మూడు, దుద్యాల గ్రామం నుంచి భూమి సర్వే చేయించాలని ఓ రైతు అర్జీ చేసుకున్నారని తెలిపారు. .

అందుబాటులో ఎలుకల నివారణ మందు

కొత్తపల్లి: వరి పొలాల్లో సమూహిక ఎలుకల నివారణకు ఆర్‌బీకేలలో మందు అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.మహేష్ సోమవారం తెలిపారు. మండలంలో 984 హెక్టార్లలో రైతులు వరిని సాగుచేసుకున్నారన్నారు. వరిలో ఎలుకల బెడద నివారించేందుకు ఆర్‌బీకేలలో ర్యాటోల్ అనే మందు అందుబాటులో ఉందన్నారు. ఈ మందు కావాల్సిన రైతులు పొలం పాసుబుక్కు, ఆధార్‌కార్డుతో ఆర్‌బీకేలలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు.

బీమా సాయం అందజేత

పగిడ్యాల: గుండెపోటుతో మృతి చెందిన కాటేపోగు శేఖర్(40) కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశామని వెల్లడించారు.

సారా విక్రేతల అరెస్టు

మిడుతూరు: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామం వద్ద నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్.ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన నీలి శికారి పరుశురామ్, పసుపల గ్రామానికి చెందిన కుమార్ చింతలపల్లి గ్రామంలో సారా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

దాడి అమానుషం

ఆత్మకూరు: ఢిల్లీలోని న్యూస్ క్లిక్ కార్యాలయంపై పోలీసులు దాడి చేయడం అమానుషమని రైతు సంఘం మండల అధ్యక్షుడు మాబాషా, కార్యదర్శి వీరన్న, సీఐటీయూ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలపై విచక్షణా రహితంగా పోలీసులు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు రణధీర్, నరసింహానాయక్, సురేంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గాజులపల్లెలో చోరీకి యత్నం

మహానంది: గాజులపల్లెలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఓ ఇంట్లో సోమవారం చోరీ యత్నం జరిగినట్లు స్థానికులు తెలిపారు. వెంకటేశ్వర్లు ఇంట్లో ఓ దొంగ చోరీకి యత్నించి పారిపోతుండగా గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. రోడ్‌సేఫ్టీ పోలీసులకు సమాచారం అందించగా చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ విచారణ చేస్తున్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

జూపాడుబంగ్లా: వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో జూపాడుబంగ్లా మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కర్ణ డిమాండ్‌చేశారు. సోమవారం ఇరుపార్టీల ఆధ్వర్యంలో జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కర్ణ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. దీనికితోడు రబీ సీజన్‌కు సాగు నీరు సరఫరా అయ్యే అవకాశం లేనందున ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏసన్న, శ్రీను, రాము, శివ, హరి, ప్రసాద్ పాల్గొన్నారు.

రుతుక్రమంపై అవగాహన అవసరం

వెలుగోడు: మహిళల్లో రుతుక్రమం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని వెలుగోడు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమూల్య అన్నారు. నంద్యాల చైతన్య కళాభారతీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రుతుక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బహిష్టు సమయంలో బాలికలను, మహిళలను అంటరానివారుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చైతన్య కళాభారతి సంస్థ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో చైతన్య కళాభారతి చైర్మన్ వి.విజయభాస్కర్, కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వెంకటయ్య

మహానంది: నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బండిఆత్మకూరు పీఆర్ ఏఈ వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నంద్యాలలోని ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నాయకులు డీఈ హరిదాస్ ఈరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధన్‌రావు, అనంతపురం జిల్లా ఏఈ మద్దిలేటి వీరి ఆధ్వర్యంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు

ఆత్మకూరు: పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో సోమవారం స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి తనయుడు శిల్పాకార్తీక్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందని ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో 50 మందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారన్నారు. అంతకు మునుపు కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే ఆసుపత్రిలో రోగులకు, వృద్ధులకు, గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. వెలుగోడు లో ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కార్తీక్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

వేటగాళ్ల అరెస్ట్

ఆత్మకూరురూరల్: అడవి జంతువుల పాలిట యమకింకరులుగా మారిన వృత్తి వేటగాళ్ల బృందాన్ని ఆత్మకూరు సర్కిల్ పోలీసులు దాడులు నిర్వహించి అత్యంత సాహసో పేతంగా నల్లమల అడవుల్లో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆదివారం రాత్రి జరిగిన ఈదాడి గురించి సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ నాగభూషణ్ తెలిపిన మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నాటుతుపాకులతో పలువురు నల్లమల అడవుల్లో తిరుగుతున్నరన్న పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు కృష్ణమూర్తి, నారాయణరెడ్డి, వెలుగోడు ఎస్‌ఐ వెంకట ప్రసాద్‌లు తమ సిబ్బందితో ప్రణాళికా బద్ధంగా దాడులకు పూనుకున్నారు. వెలుగోడు మండలం గట్టుతండా నుంచి ఒక వేటగాళ్ల బృందం నల్లమల అడవుల్లోకి వెళుతున్నారని తెలిసింది. దీంతో వారు వ్యూహాత్మకంగా మాటు వేసి దాడి నిర్వహించగా సిద్ధాపురం గ్రామానికి చెందిన పీట్ల వెంకటేశ్వర్లు, ప్రతాప్, పీట్ల మహేష్, పీట్ల ఈరన్న, సంపంగి రాఘవేంద్ర, కుంచల శివ అనే వ్యక్తులు తుపాకులతో అడవిలోకి వెళ్తూ కనిపించారు. వారిని పోలీసులు అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు తప్పించుకు పారి పోయారు. వారినుంచి ఆరు 12 బోర్ ఎస్‌బీఎంఎల్ సింగిల్ బారెల్ తుపాకులు, ఆరు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఇదిలా ఉండగా నిందితులు ఆరుగురిపై గతంలో పలు కేసులు ఉన్నాయి.



తుపాకులతో పట్టుబడిన నిందితులతో పోలీసు అధికారులు

అక్రమ తుపాకులను స్వాధీనం చేయండి

ఎవరైన లైసెన్స్ లేని తుపాకులు, నాటు తుపాకులు కలిగి ఉండడం చట్టపరంగా నేరమని సీఐ నాగభూషణ్ అన్నారు. ఏదో కారణంగా వాటిని కలిగిన వారు వెంటనే స్వచ్ఛందంగా తమకు స్వాధీన పరచాలని కోరారు. స్వచ్ఛందంగా అప్పగించిన వారిపై తక్కువస్థాయి కేసులుంటాయని, అలా కాకుండా పోలీసులకు చిక్కితే మాత్రం కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.